# "అన్న వాకు పిట్ట"

## శ్రీ పూడిపెద్ది వెంకటరమణయ్య

'ఒక యింటివాడవు కమ్మ'ని సనాతనంగా వస్తూన్న దీవన: గృహస్థునకు ఇల్లు. పక్షులు సహా గూళ్ళు కట్టుకుంటాయి. చాలు, ఒక యిల్లంటూ తనదుంటే చాలు - అదే మొగటికోర్కె - అచో టెంతయినా సరే - దానికి కావలసినన్ని సదుపాయాలూ ఉన్నా సరె లేకున్నా సరే - 'తనది' అని హద్దుగా, ఆనవాలుగా, హక్కుగా, ఉండాలి అందులోనూ బ్రాహ్మణుడు స్వగృహే అనుకోవాలి - తరువాత ధర్మపత్నీ సమేతుడనుకోవాలి - అందు కోసమే పెండ్లిచేసుకొనుటా ఇల్లుకట్టుకొనుటా. అక్కడితో నిలచిపోదు గృహస్థధర్మం. సంతానము - అందులోనూ పుత్రసంతానమును కనుక్కోవలెను. ఆ పూర్వపు దీవనే 'నీయిల్లు వేయిళ్ళు మొదలై' అని కాక అభివృద్ధి పొందుతుంది. వేయంటే నిజంగా వేయికాదు - ఎన్నడయినా సరే శాఖోపశాఖలుగా ఆయిల్లు వ్యాపించవలెనని - కొన్నితరాల నాటికయినా పెద్దల ఆశీర్వాదం ఫలిస్తుందేమో. ఇల్లుకట్టి నామకరణంచేయ నక్కరలేదు- ఇంటిపేరుకూడా స్థిరమయ్యే ఉంటుంది - వాళ్ళయింటిపేరు భాగ్యాలవారు - వానిపేరు రామశర్మ - వీరాంధ్రులో లేక ఏ ప్రాంతములనుండో వచ్చి ఆంధ్రదేశంలో ఆవాసం ఏర్పరుచుకున్నారో గాని వారి కాపురస్థలం వెలగవలస - తాతలనాటినుండీ వారాగ్రామాన్నే ఆశ్రయించుకొన్నారు. రామశర్మ తనయిల్లు చక్కగా దిద్దికట్టుకున్నాడు - పూర్వమది వట్టి పూరియిల్లేను - వాని పూర్వులు కాస్త ఆచార సంపన్నులు కావడంచేత మడిగట్టుకొని ఉండేవారు. వారు నిర్వర్తించే పౌరోహిత్యాలలో సుబ్బారాయుడు శాస్త్రీ అంతే, తాత రామమూర్తిశాస్త్రీ అంతే - అయితే - నియమం కాస్త సడలించకపోతే - ఏవృత్తి కయినా రాబడి కూడా నియమం పాటించి హద్దులో నిలబడి పోతుంది కాదూ! దాన్నితో భాగ్యవంతు లెలాగు కాగలరు?

రామశర్మకు కాపుటింటి పౌరోహిత్యాలు హెచ్చుగా ఉండేవి. అప్పటి కాపువాళ్లకు పురోహితుడంటే దైవమన్న మాట. వానికిచ్చే పట్లు వారిచేతుల కెముకలుండేవి కావు - అంబటిలోముంచి విసరిన చింతపిక్కల దెబ్బలతో రామశర్మ శరీరం గట్టిపడి కాయశరీర మయింది. సంచీ దశ మెక్కి సంసారి అయ్యేడు - ఇల్లుకట్టేడు - ఇద్దరు కొడుకులకూ చెరిఒకగది - గదులనడుమ సావడీ - ముందుటిల్లు - మధ్యనడువాకిలి దాని కవ్వల వంటయిల్లు భోజనముల గదీని - పెరటిలో గచ్చునుయ్యి - చుట్టూప్రహారీ - దొడ్లో, పాదులూ పూలమొక్కలూ, ఆవులశాల - రామశర్మ కాలంలో పలు పలుకులు పలుకుతూ ఉండేది ఆయిల్లు - వాని యేలుబడి అయింది- ఇద్దరు కొడుకులూ, పౌరోహిత్యాలు పంచుకున్నారు - పంటభూమి పంచుకున్నారు- పాత్రసామాను పంచుకున్నారు ఆయిల్లు చీల్చి రెండుగా పంచుకున్నారు-అరనుయ్యి వీనిది అరనుయ్యి వానిది.

వెంకటేశం, పెద్దవాడు-గోపాలశర్మ చిన్నవాడూను - అన్నదమ్ములకు పొత్తేమిటి? అందులోనూ పెండ్లాలువచ్చిన తరువాత - వాడియింటి భాగానికీ వీనియింటి భాగానికీ నడుమగోడ. వెంకటేశం భార్యా గొప్పయింటిబిడ్డ-కాస్త త్రిప్పలాడి - గర్వంలావు ఆమెకు.

గోపాలశర్మ పెండ్లాము పేదయింటిపడుచు, సాత్వికురాలు, సంసారపు గొడవతప్ప మరేమీ అక్కరలేదు. ఉదయంలేచి ఆమె ప్రాచీపని చేసుకొని చెరువుకువెళ్ళి నీళ్లు తెచ్చుకొని వండి పెనిమిటికిపెట్టి తానుతిని అంట్లూ ఎంగిళ్లూ చేసుకునేసరికే అల్లంత ప్రొద్దుండేది. గోపాలశర్మకు కాస్త ధన మెక్కువ చేకూరింది కొద్దికాలంలో, వెంకటేశమూ కంటే. వెంకటేశం తెచ్చేవాడు గాని వానికి ఖర్చు హెచ్చు - భార్యసుకుమారి. ఇద్దరికీఇంకా బిడ్డలు లేరు.

గోపాలశర్మ కాస్త అందగాడి లాగుంటాడు, ఎఱ్ఱగా బుఱ్ఱగా. అతడు నీర్కావి ధోవతులు కట్టుకొని మెడలోని బంగారపుటుట్ల తావళం సవరించుకొంటూ వీధిలో నడుస్తూ ఉంటే చూచి, ప్రవరుడనేవాళ్ళు - అపూరువాళ్ళు. గోపాలశాస్త్రి ఆమాటవినీ విననట్టు విని, ఇంటికి వచ్చి, ఒకప్పుడద్దం చూచుకొని, చూచుకొని, భార్య లక్ష్మమ్మ ముద్దరాలి మొగం చూచేవాడు - లక్ష్మమ్మ చాలా మంచిది - తోటికోడలుతో కూడా పొత్తుగానే ఉండడానికి ప్రయత్నించేది - అయితే సుందరమ్మ లక్ష్మమ్మను ఈసడించేది - హేళనచేసేది - ఈసుపెట్టుకొని ఏమేమో అనేది.

గోపాలశర్మ భార్యనుచూచి, అద్దంలో తనముఖం చూచుకొని- ఉఁహుఁ అని తలయూచేవాడు - లక్ష్మమ్మ మీద వానికి జాలిమాత్ర ముండేదిగాని ప్రేమచాలినంత లేదు. తనకు తగినభార్య కాదనుకొనేవాడు. దిగ్గనలేచి గదిలోకి వెళ్లి కావిడీ పెట్టెతెరచి రూపాయీల సంచుల్ని చూచుకొని మురిసిపోయేవాడు - "ఓ! చాలు! చాలకేమీ! మంచిదాన్ని అందమైనదాన్ని పెండ్లాడ వలెన"ని వానిమనస్సులో చిన్న సంకల్పం కలిగింది - కావలసినంత రూపం, యౌవనం, ధనం, కూడా ఉన్నాయి తనకు. అద్దం చూచుకొని ఆలోచించుకునేవాడు - నిశ్చయించుకునే వాడు - అంతలో లక్ష్మమ్మను చూచి జాలి పడేవాడు.

* * *

సింహాచలంలో సిద్ధాంతంవారి పిల్లను వివాహం చేసుకొని ఇంటికివచ్చేడు. అన్న వెంకటేశమూ పెండ్లామూ కూడా మగపెళ్ళివారి సందడిచేసేరు - జాము పొద్దెక్కకముందే బండ్లుదిగేయి లక్ష్మమ్మ వాకిట్లో.

నిన్నా మొన్నా నీలాటిరేవున అమ్మలక్కలు లక్ష్మమ్మ నడిగేరు - "నీ మగడు మళ్ళా పెండ్లిచేసుకుంటున్నాడా? ఆమాత్రం తెలీదమ్మా నీకూ! మీతోటక్కా భావగారూ కూడా వెళ్ళేరే! నీతో చెప్పనైనా లేదా? దానితో నువ్వేలాగు వేగిస్తావు తల్లీ? వీధితలుపు గడియవేసి మరి తియ్యకు - ఇంటికి యజమానురాలివి నువ్వు" లక్ష్మమ్మకీ మాటల కర్థమే తెలిసిందికాదు - అద్దంలాగిల్లు బాగుచేసుకోడం ముద్దవండుకొని తినడం - ఏంవంటలూ! పిండివంటలా? పిటాగ్లా?- ఏదోకూరా, పప్పూ, చారూ, ఎఱ్ఱబియ్యం కూడూను - అవి తయారయే సరికే మూడు జాములవేళ అయేది. పల్లెటూరి భోజనాలు పడమటి ప్రొద్దులోనే!



చెరువునుండి బిందె నీళ్ళూ తలకెత్తుకొని లక్ష్మమ్మ ఇంటికి ఐచ్చేసరికి గుమ్మంలో సవారీ మంగళతూర్యాలూ! పసుపు బట్టలతో గోపాలశర్మా, వానిచేయి పట్టుకొని పంద్రెండేండ్ల పెండ్లికూతురూ ఉన్నారు. లక్ష్మమ్మ వారిని చూచింది-అమాయికం-ఆబాజాల సందడీ మగనిముస్తాబూ చూచి పొంగిపోయింది - మొలలో తాళం తీసి తలుపుతెరచి కొని ఇంట్లోకి వెళ్ళినట్టేంట నీళ్ళబిందె దింపి, సుమ్మగా మంచా ఆరివెయ్యడానికి పెరట్లోకి పోయింది. తిరిగీ నడివాకిట్లోకి ఆమె వచ్చేసరికి ముగ్గులవాకిట్లో ముచ్చటగా పెండ్లి పీటలమీద పెనిమిటి గోపాలశర్మా, క్రొత్తపెండ్లామూ కూర్చున్నారు - వీధివారందరూ వింతచూడ వచ్చేరు - కొందరు ముత్తైదువలూ చేరేరు-సుందరమ్మ మందరంలాగు తిరుగుతూ పనిచేస్తోంది.

మరదిగారి యిల్లంతా చక్క బెడుతూంది - తెలిసీ తెలియని ఘోషగాచూస్తూ చీడీఅంచున నిలబడ్డాది లక్ష్మమ్మ.

ఏమో! తనమగని కేదో సుఖం అవుతూంది - అదే మంచిది - మరొకర్తెను పెండ్లాడేరు కాబోలు - అయితేనేం అదీ ఉంటుంది ఇంట్లో - నేనెందుకు దుఃఖపడాలి - ఇదీ ఆమె మనస్తత్వం అప్పుడు.

* * *

గోపాలశర్మ క్రొత్తపెండ్లాంతో కులికే రోజులు వచ్చేయి - అయితేనేం లక్ష్మమ్మ జీవితంలో ఏమీమార్పు లేదు - మునుపామె వండి మగనికొక్కనికే వడ్డించేది - ఇప్పుడు మగనికీ వాని క్రొత్తభార్యకూ వడ్డిస్తూంది - ఇదీ ఆమె జీవితంలో మార్పు.

ఏనాడయిందో లక్ష్మమ్మ పుట్టింటినుండి వచ్చి ఆనాటి నుండీ ఆమెకు ప్రతిదిన చర్యా ఒక్కటే, ఏమీ మార్పు లేదు - అలవాటయిపోయింది ఆమె జీవితవిధానం - అందులో చిన్నప్పటి తలిదండ్రులనూ - ఒక్కడే అయిన తన అన్ననూ కూడా విస్మరించేసింది - అవకాశం లేని ఆమెప్రేమ అలాగే త్రుప్పుపట్టి పోతూంది - ఆమెలో సోదరప్రేమ నిద్రపోతూంది - ఆరేయి సావిట్లో ఒంటిగా పడుక్కుంది లక్ష్మమ్మ - గదిలో క్రొత్తపెండ్లాముతో కులుకుతున్నాడు, గోపాలశర్మ - లక్ష్మమ్మకు కలవచ్చింది. కలలో అమ్మా, నాన్నా, అన్నా, ముగ్గురూ ఆమెచెంత కూర్చున్నట్టు, ఆమెను ముద్దాడినట్టు ఆమె కేమేమో ఇష్టమయిన పదార్థాలు పెట్టినట్టూ తానూ అన్నా తన పుట్టినింటి అరుగుమీద ఆడుకున్నట్టు కలవచ్చింది. ఆమె త్రుళ్ళిపడి లేచి కూర్చుంది - 'అన్న! ఏడీ!' కన్నులు నులుముకొని చూచింది - 'ఏడీ?' ఆముదపు ప్రమిదలోని వత్తి ఎగయబెట్టి సావిడి అంతా తీక్ష్ణంగా కలయ చూచింది - "అన్న! ఏడీ? రాలేదు! వట్టిదే! కల!- అన్నను చూడాలి! అన్నను ఎలాగు చూస్తాను?" అనుకుంది.

ఏ ప్రేవులలో కప్పబడిందో అన్నమీది ఆ ఆశ. ఆప్రేమ - ఆమె హృదయాన్ని రేపింది - రేగింది - ఏగోలా ఎరుగని లక్ష్మమ్మ ప్రేమ - సోదరప్రేమ హృదయంలో తాండవిస్తూంది - 'అన్న, అన్న' అదేతలపు; అదే పలవరింత త్రుళ్ళిపడి మళ్ళా చూచింది - సావిడీఅంతా!

అమాయక హృదయంలో ప్రేమ అలాగే ఉంటుంది. ఆమెకే భర్తృప్రేమ తెలిసిఉంటే, ఈప్రేమలా నాడే ఆమె హృదయంలో వెలిసిపోయే ఉండేవి - భర్తను ప్రేమించడ మేమిటో ఆమెకు తెలియనేలేదు. అయితే జీవితం ప్రేమబద్ధం. దేనిని ప్రేమించకుండా హృదయం ఉండదు - ఆప్రేమ రేగింది. ఆమె హృదయంలో ఆమెకు అన్నమీద చాలాప్రేమ. తనకంటె ఒకటి రెండేండ్లే పెద్దవాడయిన అన్నతో కలసి ఆరోజుల్లో ఆడుకునేది - వానిరూపే ఆమె కన్నులలో నిలచిం దిప్పుడు. అప్పుడు కప్పబడిన ఆ సోదరప్రేమ ఉద్రేకించింది - ఆమె హృదయానికి మరోప్రేమ తెలీదు - అన్న అన్నను చూడాలి. అన్నతో మాటాడాలి 'అన్నా అన్నా' అని పలవించి పడుక్కుంది లక్ష్మమ్మ.

లక్ష్మమ్మ ఆ మరునాడు - పనిపాటులేమీ చేసుకోలేక పోయింది - పొరుగువాళ్ల చిన్నదీ వాళ్లఅన్నా అరుగుమీద ఆడుకుంటూ ఉంటే అలాబిందెచేత్తో పట్టుకొని (చెరువుకి వెళుతూ) నిలబడి పోయింది - 'అన్న' ఆమెకన్నుల నిండా నీరుగ్రమ్మి నేలకు చొటచొటా చినుకులు రాలేయి - "సవతివచ్చేక సంతోషమెలా వస్తుందని చూచిన వాళ్ళా యేడ్పున కర్థం చెప్పి తీరుతారు - లక్ష్మమ్మకు సవతేమిటో ఇంకా తెలీదు - తెలియనివాళ్ల కంతే, ఎన్నాళ్లయినా వాళ్లలాగే ఉంటారు - చెరువుకు వెళ్లింది లక్ష్మమ్మ - ఏయింటలేరు పిల్లలూ? ఏవాకిట పిల్లలాడుకోలేదు. ఎక్కడ అన్నా చెల్లినీచూచినా అట్టే నిలబడిపోయేది లక్ష్మమ్మ "అన్న! నాకంట ఎలాబడతాడు?" ఆమెకు కన్నులు వాచిపోతున్నాయి - హృదయం కుదుట నిలువ లేదు - కన్నవారి ఊరువెళితే అన్న కనబడతాడన్న ఉపాయం కూడా ఆమెకు తట్టలేదు. ఒకవేళ అలాటి ఉపాయం తట్టినా ఇల్లో - ఇల్లోకవిధి - అంతే తెలుసును. ఆమెకు - ఆయింట్లో పనిచేసేయంత్రం తానూ - తాను వెళిపోతే ఇల్లునిలబడి పోతుంది - తప్పు! తానిల్లు విడువ కూడదు - అవీ ఆమె ఊహాలు - అన్ని ఊహలనూ దాటి అన్నమీదికే పోతూంది ఆమె హృదయం.

ప్రేమించే (అన్యోన్యం) సోదరులుగాని, తల్లీ బిడ్డాగాని, భార్యా భర్తలుగాని, కడకు ఇరువురు స్నేహితులుగాని, దూర మింతయినా సరే - ఒకరు రెండవవారిని తలచికొని నప్పుడు రెండవవారు మొదటివారిని అన్యోన్యం అదే సమయంలో తలచుకోడం చాలాచోట్ల సంభవిస్తుంది. ఇది ప్రేమతంత్రి - ఇక్కడ ప్రేమచేత దడదడా కొట్టుకొన్న రక్తనాళాల కదలిక, హృదయసంచలనం - ఏ అడ్డంకులూ లేకుండా, దూరమెంతయినా, ప్రయాణంచేసి - అక్కడ ఆ హృదయాలలో ప్రతిధ్వనిస్తుంది - ఏ సంబంధమూ లేక ఏర్పటుకొన్న స్నేహప్రేమే ఇంతపని చేయగలిగినప్పుడు సహజంగా, జన్మతోకూడా రక్తము పంచుకొని, ఒకేజనని కడుపునబుట్టిన సోదరులమాట వేరుగా చెప్పవలెనా ?

అదేసమయమున అన్నకుకూడా చెల్లెలిని చూడవలెనని బుద్ధిపుట్టింది. 'అమ్మా! చెల్లెలు లక్ష్మమ్మ, ఏనాడ యిందో, అత్తవారింటికి వెళ్లిపోయినది. నాకామెను చూడ వలెనని ఉన్నది - నేనేపని చేస్తూఉన్నా లక్ష్మమ్మే నాకన్నులకు కనబడుతూంది - జాలిగా ఏడుస్తూ ! నాకేమీ తోచలేదు - ఆ దౌర్భాగ్యుడు తిరుగ వివాహమాడినాడని విన్నాను. ఒకతూరి పోయి చెల్లెలిని చూచివస్తానని తల్లి దండ్రులతో చెప్పి - చాకింటి పంచకట్టుకొని, చాకింటి చొక్కాతొడుక్కొని - నడుమునకు పట్టుపంచ చుట్టుకొని, తలకు పాగాచుట్టుకొని భుజంమీద చిన్నగామంచావేసి కొని చేత బాణాకఱ్ఱ పట్టుకొని కిఱ్ఱుచెప్పులు తొడుగుకొని. వేకువజామున బయల్దేరినాడు - భద్రయ్య- లక్ష్మమ్మ సోద రుడు - పాలవలసలో -

తెలతెలవారుతూంది, లక్ష్మమ్మ నిద్రలేచింది. తెల్ల వార్లూ అన్న వచ్చినట్టు, తన్ను పలకరించినట్టు, కలకంటూనే ఉంది. ఆస్థితి భరింపలేక గాబోలు - రోజూకంటె పెంద లాడే లేచింది - అరుగు అలికింది - మీదిగడప అలికింది - మునివాకిలి తుడిచి కలాపిచల్లుతూంది - వీధికొసకు చూచింది - ఏమో – ఎవరో ! "అన్నవచ్చేడు కాబోలు ! నిజమే ! అల్లంతదూరాన చూచి "అన్నా" అని పలుక రించింది - ఆమె కన్నులనిండా ఆనందబాష్పాలు నిండి నాయి - వలవలా యేడుస్తూ తడిచేతులు వ్రేలాడవైచికొని అన్ననుచూస్తూ నిలబడిపోయింది. చెల్లీ ! అని ఆత్రంగా పిలిచేడు భద్రయ్య - "అన్నా నిజంగా నీవేనా? రెండు రోజులాయ నీమీద కలలువస్తున్నాయి - వచ్చేవా ? నీవేనా ? నీవేనా ?" – ఆమెకు అప్పుడేమి చెయ్యడమో తెలిసిందికాదు - ఆతడే చెల్లెలిగుమ్మమెక్కి సావిట్లోకి వెళ్లి



కిఱ్ఱుచెప్పులు గుమ్మములో విడిచి బాణాకఱ్ఱ మూలను చేర వేసి అచట నిలచేడు. లక్ష్మమ్మ చీపురూ చెంబూ గిన్నెతో, లోపలకువచ్చి - "అన్నా నీవేనా? అని ఆనంద బాష్పాలు కురియించింది. అన్నవచ్చేడు - అన్నవచ్చేడు - ఆమె ఆనందానికి మేరలేదు - అప్పుడేం చెయ్యడమో ఆమెకు తెలిసిందికాదు - పొరుగునున్న, తోడికోడలును, గోడ ఈవలనుండి, 'సుందరమ్మక్కా' అని పిలచి 'అన్న వచ్చేడ'ని ప్రకటించింది 'అన్నవచ్చే'డని అప్పుడే నిద్ర మేల్కొన్న సవతితో చెప్పింది – ఇంకనూ నిద్రమంచం దిగని భర్తతో చెప్పింది 'అన్నవచ్చేడు' – అన్నవచ్చిన ఆమె ఆనందం వారికేంతెలుస్తుంది ? - సుందరమ్మ "రానీ! భూమికి పుత్రుడా? జగతికి చంద్రుడా? అన్నట ! ఎవరి కన్న ఎక్కువవాడు" అని యేమేమో గొణుగుకొంది. సవతి తనఅన్న కాబోలునని తేరి భద్రయ్య క్రొత్తమొగముచూచి మాటాడకుండ పెరటిలోకి పోయింది. భద్రయ్యా సావిడి

నడుమ అలాగే నిలబడ్డాడు - వానికి కాళ్ళుకడిగికొండికి నీళ్ళివ్వవలెనని గాని మంచంవాల్చి కూర్చుండుమనవలెనని గాని లక్ష్మమ్మకు తట్టలేదు - ఆమె సందడే ఆమెది. శాలలో ఆవుకు గడ్డివేస్తూ ఆవుతో కూడా చెప్పింది అన్న వచ్చేడని - 'అన్న వచ్చేడు వచ్చేడు' అదే పలుకు అమాయ కానందం.

గోపాలశర్మ నిద్రలేచివచ్చి బావమరదిని మర్యాదగ పలుకరించి కూర్చుండుమని గోనెపరచి - 'లక్ష్మి' అని పిలచేడు - ఎన్నాళ్ళకా పిలుపు! రెండవపెండ్లాము వచ్చేక ఆ పిలుపు ఇంట్లో వినబడలేదు - నాటికి నేడు - "లక్ష్మీ! మీ అన్న వచ్చేడు, రోజూవలెగాక వేగముగా వంటచెయ్యి! ఏదయినా పిండివంటవండు" అని చెప్పేడు - మనస్సు లెలాగున్నా మర్యాదలకు లోటురాకూడదు - ప్రేమ నటించేడు - పెద్దయింటివాడుగదా! గోపాలశర్మ భార్యా, రెండఃభార్యా బంగారం, విన్నాదా మాటలు రెండూ - ఆమెచెవుల కవి రుచించలేదు - మొగం తుడుచు కుంటూ రొసరొసలాడిందిగాని ఏమంటుంది, ఊరకొంది - కోపంగా పడకగదిలోకి వెళిపోయింది. లక్ష్మమ్మ బియ్యం కడిగి ప్రొయ్యిరాజపెట్టి - ఆలోచించింది - "పిండివంట; ఏమి పిండివంట? నాకేమీ వండడం తెలీదు. అన్నకేమి పిండివంటయిష్టం? ఆఁ జ్ఞాపకంవచ్చింది - అన్నకు పర మాన్నం యిష్టం - పరమాన్నం ఎలాగు వండుతారో" ఆలోచిస్తూ కూర్చుంది కొంతసేపు — ఏమాలోచన? గడుసుదా? ఉపాయమెరిగినదా? ఊహించుకోగలదా? అక్కడ కొక ఊహతట్టింది. ఆమెకు ఆఊహతో తిమ్మిర్స అయినట్టనుకొని దిగ్గన లేచి పెరటిగోడకడకు పోయి గోడ పయినుండి తోడికోడలును - "సుందరమ్మక్కా" అని పిలిచింది - ఆమె వెంటనే పలకలేదు - తిరుగా పిలిచింది - సుందరమ్మ "ఆఁ! లక్ష్మమ్మా విన్నాను - అన్నవచ్చేడు - అదేకదూ కబురు?"

లక్ష్మ:—ఔనుగాని అక్కా! నీవొకసారి ఇలాగు గోడదగ్గరకురావూ నిన్నొకసంగతి అడగాలి -

సుందర:—అబ్బో! సంగతులే! సంగతులమీద సంగతులు! - ఏమిటి వింత? ఆవులింత? ఇత్తడిమంత! ఏమిటి లక్ష్మమ్మా? నీవింత మాటాడగలవూ? అబ్బా పెట్టకూత పెడుతూందే!

లక్ష్మ:—(ఆమాట లర్థం అవతాయా!) అక్కా [illegible] కాదు గాని - అన్న వచ్చేడు -

సుంద:—ఔను వచ్చేడు - వచ్చేడు ముమ్మాటికీ వచ్చేడూ! అయితే నేమిటి.

లక్ష్మ:—అదికాదక్కా మీ మరది పరమాన్నము వండమన్నారు -

సుంద:—ఓ వండూ! మరేం! జుట్టుదువ్వుగాని ఇంకేం? వండూ

లక్ష్మ:—అక్కా అది ఎలాగు వండడమో నాకు తెలీదు - కాస్త చెప్పవూ!

సుంద:—అలాగా (ఆలోచించింది) చాలాజాగ్రతగా వండాలిసుమా! పరమాన్నం వండడం చాలాకష్టం -

లక్ష్మ:—అందుకే నిన్నడుగుతున్నాను.

సుంద:—అయితే విను - పాలతో బియ్యం కడుగు - నెయ్యి ఎసగుపెట్టు. బాగా మరగిన నేతిలో ఆ బియ్యం పోసి బెల్లం పడీ - అదే పరమాన్నం పసందు. జిహ్వా లేచి రావలెను -

లక్ష్మ:—'సరె' అని సంతోషించి వంట ప్రారంభించింది - పాలతో బియ్యంకడిగి నెయ్యి ఎసరుపెట్టి దానిలో బియ్యంపోసి అందులో బెల్లంముక్క పడేసి కలియబెడుతూ కూర్చుంది - ఎంతసేపో - ఏమీకాదు - నెయ్యి మిగుల మరిగి మాడింది - బియ్యం చెడిపోయినది. - బెల్లం, గిన్నెకంటుకుపోయింది. వెలుగుకుతెచ్చి లక్ష్మమ్మ గిన్నెలోకి చూచింది; చిన్నబోయింది. ఆ గిన్నెలోకి చూస్తూ అలా కన్నీరు విడచింది. సవతి ఆమె అవస్థ చూచింది - జాలిపడిందో మరేమి ఊహించిందో - ఎప్పుడూ లేదు - 'అక్కా' అని లక్ష్మమ్మను పిలిచింది - లక్ష్మమ్మ తుళ్లిపడి సవతినిచూచి "అన్న వచ్చేడు - పరమాన్నం వండుదామని, నాకు తెలీక, సుందరమ్మక్కా నడుగుతే, ఇలా చెప్పింది -

అన్నీ మాడిపోయినవి - ఏదారీ తోచక ఏడుస్తున్నాను - నీకు పరమాన్నం చేయడం తెలుసునేమో చెప్పవూ అంది - జాలిగా.

బంగారం:—అయ్యో ఇలాగుకాదు పరమాన్నం వండడం - నేతితో బియ్యము కడిగి - పాలు ఎసరుపెట్టి దానిలో ఆబియ్యముపోసి బెల్లంవేస్తే పరమాన్నమౌతుం దని పక్కుమని నవ్వింది. (సవతిపోరాలయినా ఊడుకుతవి గాని తోడికోడలుపోరాలు ఊడుకవని సామెత)

లక్ష్మమ్మ - సరే అని - ఆగిన్నె తోముకొని తిరుగా నేతితో బియ్యముకడిగి - పాలు ఎసరుపెట్టి ఆ బియ్య మందులోపోసి ఉడికిస్తూంది బెల్లంవేసి. రెండుజాములు దాటిపోయింది - ఇంకా తక్కినవంట ఏమీ కాలేదు - పరమాన్నం ఘుమఘుమా పరిమళిస్తూంది. అన్నకు పెడతాను- అన్న తింటాడు ఆనందిస్తాడు నాకూ సంతోషం అను కుంటూ చిందులుత్రొక్కుతూన్న హృదయంతో పరమా న్నాన్ని చూచి పరమసంతోషం పొందుతూంది - తక్కిన వంటకి ప్రయత్నం చేస్తూంది. -

సవతి సావిట్లోకి వెళ్ళింది. లక్ష్మమ్మ కింకోఘోషే లేదు- పీటలు రెండూ వాల్చింది. భర్తకూ, అన్నకూ మోదుగాకు విస్తళ్లు పరచింది - కంచుచెంబులతో నీళ్లు పెట్టింది - కంచు గిన్నెలు విస్తళ్ళదగ్గర పెట్టింది. వంట సమాప్తంచేసింది. కాళ్ళూ చేతులూ మొగమూ కడుక్కుంది - అన్ననూ భర్తనూ మడికట్టుకోండని చెప్పటకు సావిట్లోకి చూచింది - అక్కడ గోనెలో గోపాలశర్మ కూర్చున్నాడు. వాని చేరు వను సవతి బంగారం నిలబడిఉంది - అంతే - అన్న లేదు! "అన్నేడీ! అన్నేడీ?" అని ఆత్రంగా అడిగింది "అన్నా! అన్నా! అదేమో! ఇంతవేళయింది - ఇంకాకని పెట్టుకొని ఉంటాడా? వెళ్లిపోయాడు; లేదు" - అని బంగారం బదులుచెప్పింది.

"ఆఁ! ఆఁ! అన్న – అన్న. వెళిపోయాడా? ఎక్క డకు - మరిరాడూ? రాడూ?" అని ఆత్రంగా అరచింది, లక్ష్మమ్మ. "పరమాన్నం అన్న తినవద్దూ - అయ్యో - అన్నా! అన్నా' అని పెద్దకేకలు పెట్టింది.

అన్నను పంపేసింది బంగారం ఏం చెప్పిందో - ఆతడు వెళిపోయాడు ఏంచేస్తాడు? - పరుపయిల్లూ, చెల్లెలు అమాయకురాలూను - మూడు జాములయింది. వెళిపో యాడు - నిరాశతోనో, నిరసంతోనో - ఎలాగో -

వంటయింట్లో 'అన్నా అన్నా' అని వాపోతూంది లక్ష్మమ్మ - "పరమాన్నం అన్నకు పెట్టవద్దూ? అన్న తినవద్దూ అన్నకు పెట్టకుండా ఎవరికి పెట్టేది - "

* * *

గోపాలశర్మా, రెండవభార్యా స్నానాలుచేసి నట్టిం ట్లోకి వచ్చేరు - భోజనంచేయడానికి - ఏదీ? లక్ష్మమ్మ? లక్ష్మమ్మ లేదు! అన్నకోసం చూచుట కావలకు పోయింది కాబోలు - ఆమే వస్తుందని పీటలమీద కూర్చున్నారు - పరమాన్నంకోసం చూచింది బంగారం. ఏదీ పరమాన్నం గిన్నె? లేదు పొయ్యిమీద లేదు. పెడను లేదు. ఇంట్లో ఎక్కడా లేదు!

గోపాలశర్మ 'లక్ష్మీ! లక్ష్మీ' అని పిలచేడు - బంగారం 'అక్కా! అక్కా!' అని పిలచింది. లక్ష్మమ్మ పలుక లేదు.

* * *

ఊరు బయలతోట, పశువుల కాపువాళ్ళు చెట్లనీడల కూర్చొని పేలుచూచుకుంటున్నారు - ఆ త్రోవను పోతూంది లక్ష్మమ్మ - గుడ్డచుట్టు-మీదగిన్నె (పరమాన్నం గిన్నె) తలమీద పొందుపరచుకొని కంటికీ మంటికీ ఏక ధారగా ఏడుస్తూ "అన్నా అన్నా" అన్నఅర్పులకు విధీ విరామం లేకుండా అలా వెళిపోతూంది, అడవులుపట్టి అలాగు ఎన్నిదినాలు అన్నకోసం ఆరుస్తూ తిరిగిందో ఎవరు చెప్పగలరు!

* * *

ఆవేళ గోపాలశర్మా! రెండవభార్యా బంగారం; పెరటిలో బంతిమొక్కల నడుమ చాపవేసికొని సవిలా సంగా సరసోక్తులాడుకుంటూ కూర్చున్నారు - పడమటికి

ప్రొద్దువాలింది. దబ్బచెట్టుమీద ఒకపిట్ట వాలింది-నల్ల నల్లగా పచ్చ పచ్చగా ఉంది ఆపిట్ట. దానితలను, గిన్నె పెట్టినట్టు వెంద్రుకల కుచ్చుఉంది. అది జాలిగా ఆకొమ్మ నుండి ఈ దంపతులవైపు చూచి 'అన్నా! అన్నా!' అని అర్చింది - ఎగసిపోయింది. బంగారం త్రుళ్లిపడి భర్తతో అంది "చూచేరా దానితలమీదగిన్నె? విన్నారా? అది అర్చిన అర్పు "అన్నా అన్నా" అని - లక్ష్మమ్మ పిట్టగా ఎగిరిపోయి ఉంటుంది" అని నిట్టూర్చింది. "అది అన్న వాకు పిట్ట" అన్నాడు - గోపాలశర్మ.

సంధ్యారాగం చీకటిగా ముడుచుకొని పోయింది.



చాలకాలపుది మొదటిరకం సాటిలేదు

బాద్‌షాహి

రోమ సంహారి సబ్బు

అందమయిన టిన్ను పెట్టెలో బిళ్లలు పెట్టి వున్నవి.

3 బిళ్లల పెట్టె కిమ్మతు ౧-౨ అణాలు. ఖర్చులు ప్రత్యేకము

మంచి పరిమళము నిస్తుంది. ఎల్లప్పుడు దీన్ని వుపయోగించండి

సోలు ఏజంట్లు ;—

**C. C. MAHAJAN & CO.,**

**281 Jumma Masjid, BOMBAY 2**

మద్రాసు వర్తకులు :—

జె. యం. సేట్

260 చైనాబజారు రోడ్డు, మద్రాసు